క్లుప్తంగా

కోదండరామునికి విశేష పూజలు



ఆత్మకూరురూరల్ : మండలంలోని మహిమలూరులో కోదండరామస్వామి ఆలయ శిలాప్రతిష్ఠను పురస్కరించుకుని శుక్రవారం విశేష పూజలు నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు చిట్టమూరు జితేంద్రనాగ్‌రెడ్డి, ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి, సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కంచి పరమేశ్వరరెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కుడుముల సుధాకర్‌రెడ్డి తదితరులు హాజరై పూజలు చేశారు. కలశ ప్రతిష్ఠ, స్వామి అమ్మవార్ల విగ్రహ ప్రతిష్ఠ తదితర కార్యక్రమాల సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఆలయ కమిటీ సభ్యులు మెట్టుకూరు సింగారెడ్డి, పద్మారెడ్డి, మురుకూటి వెంకటేశ్వరరెడ్డి, వల్లూరు వెంకటరమణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

10న దివ్యాంగులకు ఉపకరణాల ఎంపిక

ఉదయగిరి : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 10న దివ్యాంగులు, వృద్ధులకు సంబంధించి వివిధ ఉపకరణాల ఎంపిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ అప్పాజీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దివ్యాంగులు సదరం సర్టిఫికెట్‌తో పాటు రేషన్ కార్డు, ఆధార్ కార్డు, వయోవృద్ధులు అయితే రేషన్, ఆధార్ కార్డులతో పాటు రెండు పాస్ ఫొటోలు తీసుకుని ఉదయం 10 గంటలకు హాజరు కావాలని కోరారు.

మెగా టాలెంట్ టెస్ట్ 10న

వింజమూరు (ఉదయగిరి) : స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో నియోజకవర్గ స్థాయి టాలెంట్ టెస్టును యూటీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు సంస్థ రాష్ట్ర కౌన్సిలర్ గాలం చెంచలబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గంలో అన్ని పాఠశాలల్లో పదో విద్యార్థులు పాల్గొనవచ్చని, విజేతలకు బహుమతుల ప్రదానం ఉంటుందన్నారు.

గుండెకు భరోసాపై అవగాహన

ఆత్మకూరు : పట్టణంలోని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో గుండెకు భరోసా స్టెమీ అనే యాప్ గురించి అవగాహన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శేషారత్నం మాట్లాడుతూ గుండెపోటు వస్తే తొలి గంటలోనే వైద్య సేవలు అందితే బతికేందుకు 90 శాతం అవకాశం ఉందన్నారు. ఇక్కడ ఇప్పటి వరకు 22 మందికి ఇలాంటి ఇంజెక్షన్లు ఇచ్చి ప్రాణాలను కాపాడినట్లు వివరించారు. ఆర్‌ఎంఓ డాక్టర్ ఉషాసుందరి, హెడ్‌నర్సులు, సిబ్బంది పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతకు సన్మానం



ఉదయగిరి : గణతంత్ర వేడుకల్లో అవార్డు అందుకున్న ఏఎస్‌ఎం జమాయమ్మను తిరుమలాపురం సచివాలయంలో శుక్రవారం సన్మానించారు. కార్యక్రమంలో సిబ్బంది మన్సూర్ అలీ, జ్యోతి, స్థానికులు బ్రహ్మారెడ్డి, బాలకృష్ణ, వెంగళరావు పాల్గొన్నారు.

మెనూ తప్పక పాటించాలి

ఉదయగిరి : ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనానికి సంబంధించి మెనూ తప్పక పాటించాలని ఎంఈఓ-1 మస్తాన్‌వలీ తెలిపారు. పట్టణంలోని దళితవాడ ప్రాథమిక పాఠశాలను శుక్రవారం తనిఖీ చేసి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ నిర్వాహకులు వంటగది, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు.

రేషన్ దుకాణాల్లో తనిఖీలు

ఆత్మకూరు : పట్టణంలోని పలు రేషన్ దుకాణాలను తహసీల్దార్ సుధీర్, సివిల్ సప్లయిస్ డీటీ అజీజుల్లాఖాన్‌తో కలిసి శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. జేఆర్‌పేటలోని 13వ నంబర్ రేషన్ దుకాణంలో తీసుకున్న సరుకులకు, పంపిణీ చేసిన సరుకులకు తేడాలను పరిశీలించారు. గత నెలలో నిల్వ ఉన్న బియ్యం, ఇతర సరుకులు, రికార్డులో నమోదు చేసిన వివరాలపై ఆరాతీశారు. ఎలాంటి అవకతవకలు జరగకుండా రికార్డులు నిర్వహించాలని సూచించారు.

యానాదిశెట్టి విగ్రహ ఏర్పాటుకు శంకుస్థాపన



కావలి : కావలి మాజీ మున్సిపల్ చైర్మన్ గ్రంధి యానాదిశెట్టి కాంస్య విగ్రహ ఏర్పాటుకు ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి శుక్రవారం శంకుస్థాపన చేశారు. పట్టణంలోని మాగుంట పార్వతమ్మ రోడ్డు (ట్రంక్ రోడ్డు)లోని పొట్టిశ్రీరాములు విగ్రహం కూడలి వద్ద యానాదిశెట్టి కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నారు. కార్యక్రమంలో ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్, గ్రంధి యానాదిశెట్టి కుమార్తె అలేఖ్య, ఆర్యవైశ్య నాయకులు పాల్గొన్నారు.

పోలీస్ అవుతా



వైఎస్సార్ జిల్లా మైదుకూరులో జరిగిన రాష్ట్రస్థాయి జంప్ రోప్ పోటీల్లో 30 సెకండ్ల స్పీడ్ విభాగంలో రెండో స్థానంలో నిలిచారు. నంద్యాలలో జరిగిన జంప్ రోప్ పోటీల్లో రెండో స్థానం సాధించాడు. చిత్తూరులో జరిగిన కబడ్డీ పోటీల్లో రెండో స్థానం సాధించాడు. భవిష్యత్తులో పోలీస్ కావడమే లక్ష్యంగా రాణిస్తున్నారు.

– కాటంగారి ధరణీశ్వర్, ఏడో తరగతి

ఎస్సై నా లక్ష్యం



జాతీయ స్థాయి కబడ్డీ పోటీల్లో రాణించింది. మహారాష్ట్రలోని నాందేడ్‌లో జాతీయ స్థాయి పోటీల్లో మూడో స్థానంలో నిలిచింది. గుంటూరులోని నాగార్జున యూనివర్సిటీలో జరిగిన జూడోలో పోటీల్లో మూడో స్థానం సాధించింది. పాఠశాలల్లో వ్యాయామ ఉపాధ్యాయినిగా, లేకుంటే ఎస్సై కావాలని పట్టుదలతో చదువుతో పాటు క్రీడ్లోనూ రాణిస్తోంది.

– పామంజి సరిత. ఏడో తరగతి

టార్గెట్ ఐపీఎస్



కర్నూలులో రాష్ట్రస్థాయి రోప్ స్కిప్పింగ్ పోటీల్లో ప్రథమ స్థానం సాధించింది. నంద్యాలలో జరిగిన జంప్‌రోప్ పోటీల్లో మొదటి స్థానం, కాణిపాకంలో జరిగిన రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో ప్రథమ స్థానం, ఏలూరులో జరిగిన పరుగు పందెం పోటీల్లో మూడో స్థానం, గుంటూరు నాగార్జున యూనివర్సిటీలో జరిగిన జూడోలో రెండో స్థానం సాధించింది. మహారాష్ట్ర నాసిక్‌లో జరిగే నేషనల్ జంప్ రోప్ పోటీల్లో పాల్గొననున్నారు. ఐపీఎస్ కావాలనే పట్టుదలతో రాణిస్తున్నారు.

– ఎల్లంగారి జ్యోతి, ఏడో తరగతి

పోలీసు ఉద్యోగమే ధ్యేయం



గుంటూరు జిల్లా బిట్లవారిపాలెంలో జరిగిన రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో మూడో స్థానం, గుంటూరులో జరిగిన జూడో పోటీల్లో మూడో స్థానం, కడపలో జరిగిన హ్యాండ్ బాల్ పోటీల్లో మూడో స్థానం, ఏలూరులో జరిగిన అథ్లెటిక్స్ పోటీల్లో రెండో స్థానం, కాణిపాకంలో జరిగిన కబడ్డీ పోటీల్లో రెండో స్థానం సాధించింది. పోలీసు ఉద్యోగం సాధించడమే ధ్యేయంగా రాణిస్తోంది.

– పెల్లేటి వెంకట పవిత్ర, ఎనిమిదో తరగతి

కడలి బిడ్డలు.. క్రీడా కుసుమాలు

సత్తా చాటుతున్న తీర ప్రాంత విద్యార్థులు

కావలి రూరల్ మండలం తుమ్మలపెంట పంచాయతీ తీరప్రాంత గ్రామమైన కొత్తసత్రం జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు క్రీడల్లో సత్తా చాటుతున్నారు. చదువుతో పాటు ఆటల్లో రాణిస్తున్నారు. తల్లిదండ్రుల ప్రోత్సాహం ఉపాధ్యాయుల సహకారం తోడవడంతో పాఠశాల, మండల, జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో విజయదుందుభి మోగిస్తూ పతకాలు సాధిస్తున్నారు. చేపల వేట, వ్యవసాయమే జీవనాధారమైన పేద కుటుంబాలకు చెందిన విద్యార్థులు చిన్నప్పటి నుంచి ఆటలంటే ఇష్టంతో పాఠశాల స్థాయి నుంచి క్రీడల్లో పతకాల పంట పండిస్తున్నారు. – కావలి



శిక్షణ పొందుతున్న చిన్నారులు

ప్రయత్నం చేస్తూనే ఉంటా..



కాణిపాకంలో జరిగిన కబడ్డీ పోటీల్లో మొదటి స్థానం, తిరుపతిలో జరిగిన రన్నింగ్ పోటీల్లో రెండో స్థానం సాధించాడు. పోలీస్ అయ్యే వరకు ప్రయత్నం చేస్తూనే ఉంటా.

– కొమరి రాఘవ, పదో తరగతి

పీఈటీ ఉద్యోగం సాధిస్తా



కాణిపాకంలో జరిగిన రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలో రెండో స్థానం, గుంటూరులో జరిగిన జూడోలో మూడో స్థానం సాధించింది. పీఈటీ ఉద్యోగం సాధించడమే లక్ష్యంగా రాణిస్తోంది.

– కాటంగారి రేష్మ, ఎనిమిదో తరగతి

పోలీస్ అవుతా



అన్నవరంలో జరిగిన బాక్సుల అంగడి పోటీలో ప్రథమ స్థానం, నంద్యాలలో జరిగిన రాష్ట్రస్థాయి రగ్బీ పోటీల్లో మూడో స్థానం సాధించింది. పోలీస్ కావడమే లక్ష్యంగా రాణిస్తున్నారు.

– ప్రళయ కావేరి శ్రీలక్ష్మి, ఎనిమిదో తరగతి

పోలీస్ ఉద్యోగమే ఆశయం



కాణిపాకంలో జరిగిన రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలో మొదటి స్థానం, కడపలో జరిగిన టార్గెట్ బాల్ పోటీలో రెండో స్థానం, నంద్యాలలో జరిగిన హ్యాండ్ బాల్ పోటీల్లో మూడో స్థానం సాధించింది. పోలీస్ ఉద్యోగమే ఆశయంగా పెట్టుకున్నా.

– కాటంగారి ఝాన్సీ, పదో తరగతి

ప్రభుత్వ ఉద్యోగమే లక్ష్యం



కాణిపాకంలో జరిగిన కబడ్డీ పోటీల్లో మొదటి స్థానం, కర్నూలులో జరిగిన హ్యాండ్ వాల్ పోటీల్లో రెండో స్థానం, తిరుపతిలో జరిగిన మోడరన్ పెంటలిన్ రన్నింగ్ పోటీల్లో రెండో స్థానం సాధించింది. ప్రభుత్వ ఉద్యోగం సంపాదించాలనేదే లక్ష్యంగా రాణిస్తున్నారు.

– పెల్లేటి కావ్య, పదో తరగతి

ప్రభుత్వ ఉద్యోగం సాధిస్తా



తెనాలిలో జరిగిన రాష్ట్ర స్థాయి జంప్ రోప్ పోటీల్లో మొదటి స్థానం, మహారాష్ట్ర నాందేడ్‌లో జరిగిన జాతీయ జంప్ రోప్ పోటీల్లో మూడో స్థానం, కాణిపాకంలో జరిగిన కబడ్డీ పోటీల్లో రెండో స్థానం, కడపలో జరిగిన హ్యాండ్ బాల్ పోటీల్లో మూడో స్థానం, ఏలూరులో జరిగిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌లో మూడో స్థానం సాధించింది. చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తూ ప్రభుత్వ ఉద్యోగం సాధించాలనేదే ఆమె ధ్యేయం.

– ఎల్లంగారి కల్పన, ఎనిమిదో తరగతి

పోలీస్ కావాలనే లక్ష్యం



కాణిపాకంలో జరిగిన కబడ్డీ పోటీల్లో ప్రథమ స్థానం, తిరుపతిలో జరిగిన రన్నింగ్‌లో ద్వితీయ స్థానం, కడపలో జరిగిన కబడ్డీ పోటీల్లో మూడో స్థానం, చిత్తూరులో జరిగిన టార్గెట్ బాల్ పోటీల్లో రెండో స్థానం సాధించాడు. పోలీస్ కావాలనే లక్ష్యంతో రాణిస్తున్నారు.

– కాటంగారి రూబిన్, పదో తరగతి

డాక్టర్ అవుతా



శ్రీకాకుళంలో జరిగిన రాష్ట్రస్థాయి రన్నింగ్‌లో మూడో స్థానం, నంద్యాలలో జరిగిన రబ్బీ టోర్నీలో మూడో స్థానం సాధించింది. డాక్టర్ కావడమే లక్ష్యంగా చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తున్నారు.

– ఎల్లంగారి శ్రీలేఖ, ఎనిమిదో తరగతి

ఇంజినీర్ అవుతా



కాణిపాకంలో జరిగిన రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో ప్రథమ స్థానం, తిరుపతిలో జరిగిన మోడరన్ పెంటలిన్ రన్నింగ్‌లో రెండో స్థానం సాధించాడు. చిత్తూరులో జరిగిన టార్గెట్ బాల్ పోటీల్లో రెండో స్థానం సాధించాడు. మంచి ఇంజినీర్ కావాలనే పట్టుదలతో రాణిస్తున్నారు.

– వాయిల గౌతం, పదో తగరతి

జాతీయ స్థాయిలో రాణించాలి



నంద్యాలలో జరిగిన జంప్‌రోప్ పోటీల్లో రెండో స్థానం, కాణిపాకంలో జరిగిన కబడ్డీ పోటీలో మూడో స్థానం సాధించారు. నాసిక్‌లో జరిగే నేషనల్ జంప్ రోప్ పోటీలకు ఎంపికయ్యాడు. జాతీయ స్థాయి క్రీడాకారుడిగా రాణించడమే లక్ష్యం.

– కొండూరి రేవంత్, ఏడో తరగతి

మా ఊరుకి మంచి పేరు తెస్తా



మైదుకూరులో జరిగిన జంప్ రోప్ పోటీల్లో రెండో స్థానం, చిత్తూరులో జరిగిన కబడ్డీ పోటీలో మూడో స్థానం, నంద్యాలలో జరిగిన రాష్ట్రస్థాయి జంప్ రోప్ పోటీలో రెండో స్థానం సాధించారు. నాసిక్‌లో జరిగే జాతీయ పోటీలకు ఎంపికయ్యాడు. మా ఊరుకి పేరు తెచ్చేలా మంచి స్థానంలో ఉండాలనేది లక్ష్యం.

– మర్రి వరుణ్‌రెడ్డి, ఏడో తరగతి

క్రీడల్లో రాణిస్తా



తెనాలిలో జరిగిన రాష్ట్రస్థాయి జంప్‌రోప్‌లో మొదటి స్థానం, నంద్యాలలో జరిగిన రాష్ట్రస్థాయి జంప్‌రోప్‌లో రెండో స్థానం, మహారాష్ట్ర నాందేడ్‌లో జరిగిన జంప్ రోప్‌లో మూడో స్థానం, కాణిపాకంలో జరిగిన కబడ్డీ పోటీలో రెండో స్థానం, గుంటూరులో జరిగిన జూడో పోటీల్లో మూడో స్థానం, వైఎస్సార్ జిల్లా మైదుకూరులో జరిగిన పోటీల్లో రెండో స్థానం సాధించింది. క్రీడల్లో రాణించి పోలీసు ఉద్యోగం సాధించడమే లక్ష్యంగా రాణిస్తున్నారు. – వాయిల శాలిని, ఎనిమిదో తరగతి

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం



కలిగిరి : కలిగిరిలోని ఏపీ మోడల్ స్కూల్‌లో వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ హాజరై, మాట్లాడారు. విద్యార్థులు పట్టుదలతో చదివి ఉన్నతస్థాయికి చేరుకోవాలన్నారు. అనంతరం స్కాలర్‌షిప్పులు, బహుమతులు అందజేశారు. ప్రిన్సిపల్ శ్రీనివాసులు, టీడీపీ మండల కన్వీనర్ బిజ్జం కృష్ణారెడ్డి, సర్పంచ్ వెంకటసుబ్బయ్య, ఎస్‌ఎంసీ చైర్మన్ కొండారెడ్డి పాల్గొన్నారు.

నిబంధనలు పాటించాలి



మాట్లాడుతున్న ఆర్టీసీ డిపో మేనేజర్ కరీమున్నీసా

ఆత్మకూరు : ప్రతిఒక్కరూ రోడ్డు భద్రతా నిబంధనలను తప్పక పాటించాలని ఆర్టీసీ డిపో మేనేజర్ కరీమున్నీసా పేర్కొన్నారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్న వయసు నుంచే విద్యార్థులు ప్రమాదాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం అనంతలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అక్రమ సర్వీసుల తొలగింపునకు ఫిర్యాదు



ఏఈకి ఫిర్యాదు చేస్తున్న దేవిశెట్టిపల్లి వాసులు

సీతారామపురం : అక్రమ విద్యుత్ సర్వీసుల తొలగింపునకు దేవిశెట్టిపల్లి గ్రామస్తులు విద్యుత్ శాఖ ఏఈ శ్రీహరికి శుక్రవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేవిశెట్టిపల్లి గ్రామ సర్వే నంబర్ 86-3లో 2.86 ఎకరాల ఇనాం ప్రభుత్వ భూమికి మారంరెడ్డిపల్లి ఎస్సీ కాలనీకి చెందిన ఇర్ల నాగయ్య అనే వ్యక్తి నకిలీ పాసుపుస్తకాలు, సర్టిఫికెట్లు సృష్టించి విద్యుత్ శాఖ నుంచి ఓ ట్రాన్స్‌ఫార్మర్‌తో పాటు మూడు విద్యుత్ సర్వీసులు పొందారని, వాటిని తొలగించాలని కోరారు. సదరు వ్యక్తిపై ఇప్పటికే జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసి ఉన్నామన్నారు. దీనిపై స్పందించిన ఏఈ పరిశీలించి చర్యలు చేపడుతామన్నారు.

ఉన్నత పాఠశాలగా అప్‌గ్రేడ్ చేయాలని వినతి



ఎంఈఓకు వినతి పత్రం అందజేస్తున్న గ్రామస్తులు

ఉదయగిరి : మండలంలోని దాసరుపల్లి ప్రాథమికోన్నత పాఠశాలను అప్‌గ్రేడ్ చేయాలని కోరుతూ పీఎంసీ కమిటీ సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులతో కలిసి ఎంఈఓ మస్తాన్‌వలీకి శుక్రవారం వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ పాఠశాలలో 51 మంది విద్యార్థులు ఉన్నారని, వచ్చే విద్యాసంవత్సరానికి సుమారు 100 మంది విద్యార్థులు ఉండేలా చూస్తామన్నారు. అందుకు తగినట్లు అవసరమైన మౌలిక వసతులను తామే కల్పించుకుంటామన్నారు. అనంతరం ఎంఈఓ మాట్లాడుతూ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గౌస్ మొహిద్దీన్, స్థానికుడు జాఫర్ మొహిద్దీన్ పాల్గొన్నారు.

బైక్ అదుపుతప్పి వ్యక్తికి గాయాలు



సీతారామపురం : బైక్ అదుపుతప్పి ఒకరు గాయపడిన ఘటన సీతారామపురం-పోరుమామిళ్ల ఘాట్ రోడ్డు మార్గంలో శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. సంగసానిపల్లి గ్రామానికి చెందిన గుర్రంకొండు సుబ్బారావు పోరుమామిళ్లలో జరిగే ఓ వివాహ వేడుకకు బైక్‌పై బయలుదేరారు. మార్గం మధ్యలో ఓ మలుపు వద్ద బైక్ అదుపుతప్పి బ్రిడ్జి డివైడర్‌ను గాయాల పాలయ్యాడు. క్షతగాత్రుడిని 108 వాహనంలో ఉదయగిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

న్యాయవాదుల నిరసన

కావలి : కర్నూలులో ఏర్పాటయ్యే రాయలసీమ హైకోర్టు బెంచ్ పరిధిలోకి నెల్లూరు, ప్రకాశం జిల్లాలను చేర్చడాన్ని నిరసిస్తూ కావలి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు కోర్టు విధులను శుక్రవారం బహిష్కరించారు. ఈ మేరకు పట్టణంలోని కోర్టు ఆవరణలో నిరసన తెలిపారు. కావలి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కాటా సురేందర్‌రెడ్డి, జనరల్ సెక్రటరీ జయప్రకాష్, సీనియర్ న్యాయవాదులు కలికి శ్రీనివాసులురెడ్డి, ఎం.బాబు, మద్దాల బాబురావు, ఎగ్జిక్యూటివ్ మెంబర్లు రాజేంద్రప్రసాద్, టి.మల్లికార్జునరావు, ఎ.శ్రీనివాసులు, రమణారెడ్డి, వంటేరు లక్ష్మీనారాయణరెడ్డి, మహిళా న్యాయవాదులు విజయలక్ష్మి, నిరీక్షణ, జ్యోతి పాల్గొన్నారు.

‘మా పిల్లలకు అన్యాయం చేయొద్దు’



అనుమసముద్రంపేట : నిరసన తెలుపుతున్న మహిళలు



సీతారామపురం : పాఠశాల ఎదుట ఆందోళన చేస్తున్న తల్లిదండ్రులు

• తల్లిదండ్రులతో కలిసి విద్యార్థుల ఆందోళన

సీతారామపురం : ఇక్కడి నుంచి మూడు కిలోమీటర్ల దూరంలో ఉండే పాఠశాలకు వెళ్లి చదువుకోవడం కష్టమని, మా పిల్లలకు అన్యాయం చేయొద్దని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన బాట పట్టారు. ఈ మేరకు నారాయణప్పపేట ప్రాథమిక పాఠశాల వద్ద విద్యార్థుల తల్లిదండ్రులు శుక్రవారం నిరసన చేశారు. గ్రామంలో ఉండే పాఠశాలలో 3, 4, 5 తరగతులను సీతారామపురం గ్రామంలోని బెస్తకాలనీ పాఠశాలలో విలీనం చేయడాన్ని వెంటనే నిలిపివేయాలని వారు డిమాండ్ చేశారు. తమ గ్రామంలో కాదని మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న బెస్తకాలనీ పాఠశాలకు జాతీయ రహదారిపై విద్యార్థులను పంపడం ఎంత వరకు సమంజసమన్నారు. అధికారులు విద్యార్థులకు రవాణా ఖర్చులు ఇస్తామన్నా, ప్రత్యేక వాహనాలను ఏర్పాటు చేస్తామన్నా ఒప్పుకునే ప్రసక్తే లేదన్నారు.

పాఠశాలను విలీనం చేయొద్దు

అనుమసముద్రంపేట : తమ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలను జమ్మవరం గ్రామంలోని పాఠశాలలో విలీనం చేయొద్దంటూ ఏఎస్‌పేట మండల కాకర్లపాడు గ్రామంలో విద్యార్థుల తల్లిదండ్రులు శుక్రవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం ఏఎస్‌పేటలోని ఎంఈఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. గత 60 ఏళ్ల నుంచి తమ గ్రామంలో ఉన్న పాఠశాల ఎంతో మందికి విద్యాబుద్ధులు నేర్పిందని, ఇప్పుడు ఈ పాఠశాలను వేరే ప్రాంతానికి మార్చడం తగదన్నారు. తమ బిడ్డల భవిష్యత్తు కోసం పాఠశాలను కాకర్లపాడు గ్రామంలోనే ఉంచాలని కోరారు.

ఉర్దూ పాఠశాలను తొలగించొద్దు

సోమశిల : అనంతసాగరం మండలంలోని ముస్తాపురం గ్రామంలో ఉన్న ఉర్దూ పాఠశాలను తొలగించవద్దని గ్రామస్తులు శుక్రవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం మోడల్ స్కూల్స్‌లో ఉర్దూ మీడియం పాఠశాలను విలీనం చేసే పనులు మానుకోవాలని డిమాండ్ చేశారు.

• **సోమశిల :** మండలంలోని ఏపిలగుంట గ్రామస్తులు శుక్రవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1954 నుంచి ఏపిలగుంటలో ప్రాథమిక పాఠశాల ఉందని, అయితే ఈ పాఠశాలను ఇక్కడి నుంచి బీసీ కాలనీలోని పాఠశాలకు తరలించేందుకు అధికారులు చర్యలు చేపట్టడం తగదన్నారు. ఏపిలగుంటలోని మెయిన్ పాఠశాలను ఇక్కడే ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోయిందని వాపోయారు. పాఠశాల చైర్మన్ సుజాత, వైస్ చైర్మన్ శిరీష, సర్పంచ్ భారతి పాల్గొన్నారు.



సోమశిల : ఆందోళన చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

విద్యుత్ మోటార్ల చోరీకి యత్నం

సంగం: మండలంలోని మర్రిపాడు గ్రామంలో గురువారం అర్ధరాత్రి ముగ్గురు దొంగలు హల్‌చల్ చేశారు. ఆటోలో వచ్చి పొలాల్లోని మోటార్లను చోరీ చేసేందుకు ప్రయత్నిస్తున్న సమయంలో గ్రామస్తులు గుర్తించారు. దీంతో ముగ్గురిలో ఇద్దరు పరారయ్యారు. ఒకరిని, ఆటోను పట్టుకుని పోలీసులకు అప్పగించారు. శుక్రవారం ఎస్సై రాజేష్ వివరాలు సేకరించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం బాటిళ్ల స్వాధీనం

కావలి : రూరల్ మండలం తుమ్మలపెంట పంచాయతీలోని కొత్తసత్రం గ్రామంలో పొన్నపూడి శ్రీను అనే వ్యక్తి వద్ద పది అక్రమ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు కావలి ఎక్సైజ్ సీఐ సుంకర శ్రీనివాసులు శుక్రవారం చెప్పారు. నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. దాడుల్లో ఎస్సై ఎం.దేవిక, సిబ్బంది పాల్గొన్నారు.

రేషన్‌షాపు నిర్వాహకుడిపై కేసు నమోదు

కావలి : పట్టణంలోని ముసునూరులో కొండలరావు అనే రేషన్‌షాపు నిర్వాహకుడిపై పౌరసరఫరాల శాఖ కావలి డిప్యూటీ తహసీల్దార్ విజయమ్మ, కావలి టూ టౌన్ పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు చేశారు. సదరు రేషన్ షాపును తనిఖీ చేయగా 3,565 కేజీల బియ్యం, 307 కేజీల చక్కెర, 19 కేజీల కందిపప్పు స్టాకు ఎక్కువగా ఉన్నట్లు గుర్తించినట్లు ఆమె తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు ఎస్సై గోపీచంద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విజయవంతం చేయండి

ఉదయగిరి : ఈనెల 10న జరిగే జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని మండల వైద్యాధికారిణి శివకల్పన సూచించారు. పట్టణంలోని పాత సామాజిక ఆరోగ్య కేంద్రంలో సిబ్బందితో సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆరు నెలల నుంచి 19 ఏళ్లలోపు బాల బాలికలకు ఆల్బెండజోల్ మాత్రలు వేయించాలని సూచించారు. అనంతరం ఆమె వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో హెచ్‌ఈ వెంకటసుబ్బయ్య, సీహెచ్‌ఓ శివకుమారి, మలేరియా సబ్‌యూనిట్ అధికారి నౌషాద్ బాబు పాల్గొన్నారు.

• **వరికుంటపాడు :** 10న జరిగే జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని బాధ్యతగా చేపట్టాలని మండల వైద్యాధికారిణి కరిష్మా అన్నారు. ఆమె శుక్రవారం వైద్యశాలలో సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. మండలంలో రెండు నుంచి 19 ఏళ్లలోపు వారు 3,535 మందిని గుర్తించామని, వారికి ఆల్బెండజోల్ మాత్రలు వేయించాలన్నారు. సీహెచ్‌ఓ రాజశేఖరరాజు, పీహెచ్‌ఎన్ సువార్తమ్మ పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

సోమశిల : అనంతసాగరం మండలంలోని రేవూరు, అనంతసాగరం సబ్‌స్టేషన్ల పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏఈ మురళీకృష్ణ శుక్రవారం తెలిపారు. 33 కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తున్నట్లు తెలియజేశారు.

అభివృద్ధి పనులు వేగవంతం



ఆత్మకూరు : మున్సిపల్ పరిధిలో అభివృద్ధి పనులను వేగవంతం చేయనున్నట్లు రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అన్నారు. మున్సిపల్ కార్యాలయం ఎంజీఆర్ సమావేశ మందిరంలో శుక్రవారం అధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలోని టిడ్కో భవన సముదాయాల్లో రామాలయాలను నిర్మిస్తున్నామని, అందులో భాగంగా పట్టణంలోని టిడ్కో భవనాల వద్ద ఆదివారం తొలి రామాలయ నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. రాష్ట్ర మంత్రులు ఎన్‌ఎండీ ఫరూక్, సవిత, బీసీ జనార్దన్‌రెడ్డి, పొంగూరు నారాయణలతో పాటు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, టిడ్కో చైర్మన్ అజయ్, వక్ఫ్‌బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ తదితరుల చేతుల మీదుగా పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు ఉంటాయన్నారు. ఆత్మకూరు నియోజకవర్గంలో రోడ్ల మరమ్మతులకు రూ.30 కోట్లు మంజూరైందని, త్వరలో 10 ఎకరాల స్థలంలో బీసీ బాలికల రెసిడెన్షియల్ పాఠశాల భవనాలను నిర్మించనున్నట్లు తెలిపారు. అనంతరం 21 మందికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు.

పాఠశాల సందర్శన

వరికుంటపాడు : మండలంలోని విరువూరు జెడ్పీ ఉన్నత పాఠశాలను ఎంఈఓ-2 రమణయ్య శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థులకు పలు సూచనలు చేశారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు.